


# ప్రేమ

శ్రీరంగం ఎ. శ్రీనివాసరావు

నేను ప్రేమిస్తున్నాను.

అయితే అందులో ఎవరికీ పెద్ద విశేషం కనపడక పోవచ్చును. ఎందుకంటే యీ ప్రపంచంలో చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా చాలామంది పెద్దా,చిన్నా, ముతకా, ముసలిని ప్రేమిస్తూనే ఉన్నారు. అంత మందిలో నే నొకడిని.

కావొచ్చు. నిజమే........కాని, నేను ప్రేమిస్తున్న మాట మాత్రం నిజం.

మహాకవి శ్రీ శ్రీ అన్నట్లు.

"మహారాజుగారు మహారాణిగార్ని ప్రేమిస్తారు.

మహిషం మహిషిని ప్రేమిస్తుంది.

నువ్వు ఒకానొకత్తెను ప్రేమిస్తావు.!"

అలాగే—

నేను నీరజని ప్రేమిస్తున్నాను.

నీరజనే ఎందుకు ప్రేమించావు? అంటే నే నంత బాగా చెప్పలేను. నీరజ ఒక్కతే మా కాలేజీలో అమ్మాయి కాదు. మా కాలేజీ అమ్మాయిల్లో నీరజ ఒకతె. ఆమె పెద్ద అందగత్తె కాదు. ఆమె తండ్రి లక్షాధికారి కాడు. ఆమెలో చెప్పుకోదగ్గ స్పెషాలిటీస్ ఏవీ లేవు. ఆ మాటకొస్తే మా కాలేజీలో ఆమె కన్నా ఎన్నోరెట్లు అందమైనవాళ్ళు, డబ్బున్న వాళ్ళు, ఇంకా ఎన్నోరకాల ఆధిక్యత ఉన్నవాళ్ళు చాలా మంది ఉన్నారు. వీళ్ళల్లో ఎవర్నైనా నేను ప్రేమించవచ్చు.

కాని వీళ్లెవరినీ చూసినప్పుడు నా కనిపించని కొత్త భావాలేవో నీరజని చూడగానే నాకు కలిగేయి. ఆ భావాలన్నిటిని భద్రంగా ఒక ముద్దగా చేసి దానికే నేను ప్రేమ అని పేరు పెట్టుకున్నాను. అది ప్రేమకాదని ఎవడైనా వాదన కోసం అంటే దాన్ని ఖండించే శక్తి కూడా నాకు లేదు.

అసలు నీరజని చూసే దాకా ప్రేమనేది వొకటుందంటే నేను చస్తే నమ్మే వాడిని కాదు. ఎవడైనా ప్రేమించాడని తెలుస్తే వాడేదో చెయ్యకూడని పని చేసినట్లు భావించేవాడిని. దానికి తోడు వాళ్ళంతా రోజు కొక సినిమా చూసినట్లు అదేదో అలవాటులాగ రోజు కొక అమ్మాయిని ప్రేమిస్తుండేవాళ్లు. దానితో ప్రేమంటే నాకు వొకరకమైన అసహ్యం కూడా వేసేది. అయితే వాళ్ళందరిదీ నిజంగా ప్రేమ కాదని నాకు బాగా తెలుసు. సరిగ్గా అటువంటి సమయంలోనే నేను మొదటిసారి నీరజని చూడ్డం తటస్థించింది.

ఆమె ఫైనలియర్ బి.యస్సిలో కాలేజీలో చేరిన రోజే నాకు లేడీస్ వెయిటింగు రూము దగ్గర కనపడింది. చాలాసేపు అలాగే చూస్తూ ఉండిపోయాను. ఆ తర్వాత చాలాసార్లు ఆమెని చూడడానికి తాపత్రయ పడ్డాను. వెంటనే మాత్రం ప్రేమలో పడ్డాను.

ఒక అమ్మాయిని ప్రేమించడానిక్కావాల్సిన కనీస అర్హతలన్నీ నా కున్నాయి. కాని వీటన్నిటికన్నా ప్రేమ ఫలించడానికి వొక ముఖ్యమైందేదో కావాలని నా ఉద్దేశ్యం. అదేమిటో చివరదాకా నాకూ తెలీలేదు.

నా యీ తాపత్రయమంతా కనిపెట్టినట్లున్నాడు నా రూమ్మేటు చంద్రం. ఓ రోజున, "కొంపదీసి నువ్వు కాని ప్రేమలో పడ లేదుకదా?" అని అడిగాడు.

నాకు అబద్ధం ఆడాల్సిన అవసరం ఏమీ కనపడ్లేదు.


"అవును" అన్నాను.

కళ్ళు పెద్దవిచేసి పిచ్చివాడిని చూసినట్లు నా వేపు చూసి, "ఏమిటీ" అన్నాడు.

నాకు చిరాకేసింది.

"ఏం నేను ప్రేమించ కూడదా?" అని అడిగేను.

"అబ్బే కాదని ఎవరన్నారు. ఈ




భూమ్మీద పుట్టిన వాళ్ళెవరైనా మరెవరినయినా సరే ప్రేమించవచ్చు" అన్నాడు వ్యంగ్యంగా.

"మరికనేం."

"ఇంతకీ ఎవరో ఆ అమ్మాయి?"

"నీరజ" చెప్పేశాను.

ఇటువంటివి పబ్లిగ్గా అనకూడదని నాకు తెలీదు. మరో నెల తిరిగేసరికల్లా నేను నీరజని ప్రేమిస్తున్నానన్న సంగతి కాలేజీలో అందరికీ నోటీసు బోర్డులో పెట్టినట్లు తెల్సిపోయింది. నీరజకి కూడా తెలిసిందేమో నాకు తెలీదు కాని, నాక్కనపడ్డప్పుడల్లా నా వైపు అదోలా చూసింది. ఆ 'అదోలా' చూడ్డాన్ని ప్రేమగా చూడడం అంటా రంటాడు వో సుబ్బారావు. నాకలా అనిపించలేదు.

పోతే యిలా నా ప్రేమ గొడవ అందరికీ తెలియడం వల్ల వొక ఉపకారం కూడా జరిగింది. సాధారణంగా ఎటువంటి ఆడదాన్నయినా సరే తడుముకోకుండా ప్రేమించెయ్యడానికి కొంతమంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అలాగే నీరజని ప్రేమించడానిక్కూడా బోలెడంత మంది ఉత్సాహం చూపించారు. కాని నా గొడవ విన్నాక మరి "పాపం, మొదటిసారిగా ప్రేమించాడు, పోన్లే వాడికే వొదిలేద్దాం" అనుకున్నారో ఏమోగాని చాలామంది 'విత్ డ్రా' అయిపోయారు. కాని అంతటితో ఊరుకోకుండా నా పట్ల సుహృద్భావం ప్రకటించేసి నా ప్రేమని ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నారు. కనపడ్డప్పుడల్లా, "ఏవోయ్ ఎలావుంది నీ సంగతి" అనేవారు.

నాకు ఒళ్ళు మండినా పైకి తెలీనివ్వకుండా—

"ఏదో తమ దయవల్ల అలా ఉంది," అనేవాడిని.

కావాలని కాకపోయినా చాలా సంద ర్భాల్లో నేను నీరజతో మాట్లాడేను. ఆ అమ్మాయి నవ్వుతూ నా కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడేది. అటువంటప్పుడు నా ప్రేమ నెలా చెప్పాలో అర్థం అయ్యేది కాదు.

"నీకు తెలీదు కాని, నీతో మాట్లాడు తున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఉన్న మెరుపు నీ క్కనపడలేదురా?" అన్నాడు చంద్రం.

నిజానికి నా కేమీ కనపడలేదు.

"లేదు. అయితే ఏమిటి?" అన్నాను.

"నిశ్చయంగా నీరజ కూడా నిన్ను ప్రేమిస్తోంది" అని తేల్చేశాడు.

కాని నాకా మాట మీద కొంచెం కూడా నమ్మకం కుదర్లేదు. ఎందుకంటే నేనేమీ అంత గభాల్న ప్రేమింపబడే గుణాలున్నవాడిని కాదాయె. అంచేత నాకు నీరజను చూడగానే కలిగే భావాలే ఆమెకీ నన్ను చూడగానే కలుగుతాయని ఏమిటి గ్యారంటీ? అదే వాడితో అన్నాను. దాంతో చద్రుమని లేచి——

"నువ్వలా ఏవిటి గ్యారంటీ అంటూ కూర్చో. ఇహ అయినట్లే" అన్నాడు. నేను నిస్సహాయంగా చూశాను. వాడే జాలిపడి——

"పోనీ వో పని చెయ్యకూడదుట్రా. తీరిగ్గా కూర్చొని నీరజకో లవ్ లెటరు రాసి పారెయ్యి. దాంతో అటో యిటో తేలిపోతుంది" అని సలహా యిచ్చాడు.

నాకా సలహా ఎంత మాత్రం నచ్చ లేదు. అప్పటి దాకా నేనేదో ఆవిడ దృష్టిలో కొంత పెద్దమనిషిలా బతుకు తున్నాను. అందులోనూ యీ సినిమాల వల్లా, కథల వల్లా ప్రేమ బజారుపా లయింది. ప్రేమలేఖలు రాయడం మర్యా దస్థుల లక్షణం కాకుండా కేవలం జులాయి వెధవల హాబీగా భావించబడుతోంది. మర లాటప్పుడు నేనూ అటువంటి పనొకటి చేసి ప్రేమ కలగకపోగా ఉన్న మంచి అభిప్రాయాల్ని చెడగొట్టుకోడానికి యిష్ట పడ లేదు.

"మరెలాగరా?" అంటే——

"ఏమో" అన్నాను.

ప్రజలందరికీ నా ప్రేమ వో పెద్ద సమ స్యగామారిపోయింది. దాన్ని ఎలా తేల్చాలా అని వాళ్ళు మధనపడుతున్న సమయంలోనే హఠాత్తుగా వొకటి జరిగింది.


ఒక రోజు పొద్దున్న నేను మామూ లుగా కాలేజీకి వెళ్లాను. నీరజ కనపడి పలకరించి చేతికి వో కవరిచ్చింది, తీసి చూశాను. అది నీరజ పెళ్ళి శుభలేఖ. ప్రేమ ఎల్లప్పుడూ అవతలివ్యక్తి సుఖాన్నే కోరు తుందిట. నేనూ అదే కోరాను.

"కంగ్రాట్యులేషన్స్" అన్నాను.

"థేంక్స్" అని చటుక్కున వెళ్ళి పోయింది.

ఈ లోగా నా చుట్టూ నా ప్రేమ హితై షిలాషులంతా మూగి తలోమాటా వదిలారు.

"ఇదేమిట్రా ఇలా చేశావ్?"




"ఎంతపని జరిగిందిరా!"

"హార్డ్ లక్ బోయ్!"

నేనేమీ మాట్లాడకుండా చిరునవ్వునవ్వి వెళ్ళిపోయాను. ఈ వార్త నాకు చాలా బాధగా ఉన్నమాట నిజమే. కాని ఏం చెయ్యను. నే నామెను ప్రేమిస్తే ఆమె మరోడ్ని పెళ్ళి చేసుకోగూడదని ఎక్కడుంది.

"నువ్వు ఒకానొకర్తెను ప్రేమిస్తావు. ఒకానొకర్తె ఇంకొకానొకర్ని ప్రేమిస్తుంది."

* *

నీరజ పెళ్ళితో నాలో మార్పు వస్తుందని, బహుశా పెళ్ళిరోజు ముహూర్తం టైముకి నేను ఆత్మహత్య చేసుకోవచ్చునని, లేదా తర్వాత కాలేజీ మానెయ్యొచ్చునని, జీవితాంతం జుట్టూ, గెడ్డాలూ పెంచేసి చంకలో సారాసీసా పెట్టుక్కూర్చోవచ్చునీ నా హితైషులంతా వాళ్ళ యధాశక్తిని ఊహించారు. అంతే కాకుండా అప్పుడు నా పట్ల చూపించాల్సిన సానుభూతి సందేశాల్ని బట్టీ వేసుక్కూర్చున్నారు.

కాని నేను ఏమీ జరగనట్లే మామూలుగా తిరుగుతూండడంతో వాళ్ళ ఊహలన్నీ దెబ్బతినేశాయి. వాళ్ళు ఆ ఆశాభంగాన్ని భరించలేక పోవడంతో సానుభూతి పోయి కోపం వచ్చింది.

"వీడిబొంద, వీడికి ప్రేమేమిట్రా?

ఏదో స్టూడెంటన్నవాడు ప్రేమించలేదంటే బావుండదని అలా అన్నాడంతే. అంతేకాని వాడిది నిజమైన ప్రేమనుకున్నా వేమిటి?" అన్నారు కొందరు.

మరికొందరింకా తెగించి—

"అసలేం జరిగిందో తెలుసా? వీడు ఆ అమ్మాయి దగ్గర ప్రేమా అదీ అని వాగబోతే నీరజ చెప్పుతీసుక్కొట్టిందిట. దాంతో ఇంకావూసెత్తలేదు మనవాడు" అని కూడా అన్నారు.

నే నివన్నీవిన్నా ఎవడినీ ఏమీ అన్లేదు. వీటివల్ల నీరజ కొచ్చిన నష్టంలేదు. నా కొచ్చిన నష్టం అంతకన్నాలేదు. నీరజ పెళ్ళయింతర్వాత కూడా కాలేజీకి వచ్చింది. ఆమెకి పరీక్షలో వో పార్టు పోయింది. నేను పాసయ్యాను.

కాని నేనుమాత్రం నీరజని ప్రేమించడం మానలేదు.

*　　　*

తరువాత నాలుగు సంవత్సరాలు తిరిగే సరికల్లా నేను యమ్. యస్సి పూర్తిచేసి కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాను. ఆ రోజు ఉదయం కాలేజీకి వెళ్లేసరికి ప్రిన్సిపాలు రూము దగ్గర నీరజ కనిపించింది. ఆశ్చర్యపోయాను.

"ఏమిటిలా వచ్చారు?" అన్నాను.

"అయితే జ్ఞాపకం ఉన్నా నన్నమాట" అంది.

"అంత తేలిగ్గా మర్చిపోతానను కున్నారా? ఇంతకీ ఎందుకొచ్చారో చెప్ప లేదు"

"మీ కాలేజీలో డిమాన్‌స్ట్రేటరు పోస్టు ఖాళీగా ఉందిట. అందుకోసం...." అంది.

అప్పటిదాకా నేను గమనించలేదు. నీరజ మొహాన బొట్టులేదు. చేతులకి బంగారు గాజులు మాత్రం ఉన్నాయి.

అయితే....నా కింక ఆలోచించడానికి భయం వేసింది.

"మా యింటికి వెళ్దాంరండి"అన్నాను.

'ఎందుకు' అనలేదు నీరజ "పదండి" అంది.

ఆ రోజుకి లీవ్ పెట్టి నీరజతో ఇల్లు చేరాను.

తరువాత చెప్పింది నీరజ. ఆమెభర్త ఏడాది క్రిందట ఏక్సిడెంటులో పోయేట్ట. తర్వాత తను పోయిన బి. యస్సి. పార్టు మళ్ళీకట్టి పేసయిందిట. ఊరికే ఉండటం యిష్టం లేక ఉద్యోగల చెయ్యాలను కుంటోందిట.

ఇల్లంతాచూసి—

"ఎవరూ కనపడరేం?" అంది.

"ఎవరుకావాలి?" అన్నాను.

"మీ యావిడ" అంది.


"నే నింకా పెళ్ళిచేసుకోందే"అన్నాను.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏమో"

"ఇంకా ఎప్పుడు చేసుకుంటారు?" అంది నవ్వుతూ.

నాకు చటుక్కున బుర్ర పనిచెయ్యడం ప్రారంభించింది.




"నిన్నటిదాకా ఎవరైనా యీ ప్రశ్న వేసుంటే ఏమో అని చెప్పేవాడిని కాని యిప్పుడు మాత్రం చేసుకుంటాననే చెప్ప దల్చుకున్నాను" అన్నాను నవ్వుతూ.

"అదేమిటి?" అంది.

నాలో ఏదో ఉద్రేకం వచ్చింది. అంతకు ముందుదాకా నా ప్రేమకి కావాల్సిన అసలైందేదో నా కప్పుడే తెలిసినట్లయింది.

"చూడు నీరజా! నేను చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాను. విను....నీకు తెలుసో తెలియదో కాని నేను నిన్ను మొదటిసారి చూసినప్పుడే ప్రేమించాను. ఇప్పటిదాకా ఆ ప్రేమలోనే ఉన్నాను. మొదటిసారి చేతకాక నిన్ను వదులుకున్నాను. కాని యింక యీసారికూడా మళ్ళీ అటువంటి తెలివితక్కువపని చెయ్యదల్చుకోలేదు. నాసంగతి నీకుతెలుసు. ఇది త్యాగంకాదు ... నా స్వార్థంమాత్రమే..నీ కిష్టమేనా?" అన్నాను.

నా వైపు పదినిమిషాలపాటు సూటిగా చూసి తలదించుకొని "మీ యిష్టం" అంది నీరజ.

నేను నీరజని పెళ్ళిచేసుకున్నాక మళ్ళీ చాలామంది చాలా రకాలుగా అన్నారు. కాని నేను అవేవీ వినేపరిస్థితిలో లేను. అవునుమరి.

నేను నీరజను ప్రేమిస్తున్నాను.

అంతేకాక—

నీరజ కూడా నన్ను ప్రేమిస్తోంది.

అందుకే—

"ప్రేమను ప్రేమించిన ప్రేమ ప్రేమచే ప్రేమించ బడిన ప్రేమను ప్రేమిస్తుంది." అన్నారు శ్రీ. శ్రీ.